క్లుప్తంగా

ఉపాధిహామీ ఏపీఓగా అంజనప్ప

తంబళ్లపల్లె: మండలంలో అమలవుతున్న ఉపాధిహామీ పథకం ఏపీఓగా అంజనప్ప బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన కేవీపల్లె ఏపీఓగా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల్లో ప్రజల కోరికపై ఉపాధి పనులు కల్పించేందుకు చొరవ చూపుతామన్నారు. సిబ్బంది సహకారంతో ఉపాధిహామీ పథకం అమలులో మండలాన్ని ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తానన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం, చిప్పిలిలోని యోగభోగేశ్వరస్వామి ఆలయాల హుండీల ఆదాయం బుధవారం లెక్కించారు. యోగభోగేశ్వరస్వామి ఆలయంలో మూడు నెలలకు రూ.1,25,023, శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో మూడు నెలలకు రూ.5,09,502 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ రమణ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది అంకన్న తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువు ఎస్ఐగా గాయత్రి



ములకలచెరువు: మండల ఎస్ఐగా గాయత్రి బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈమె అన్నమయ్య జిల్లా రాయచోటిలో దిశ విభాగంలో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎస్ఐగా పని చేసిన మధురామచంద్రుడు మదనపల్లి వన్ టౌన్‌కు బదిలీ అయ్యారు.

పశు సంవర్ధక శాఖ ఏడీగా శ్రీధర్ రెడ్డి



కురబలకోట: కురబలకోట, బి.కొత్తకోట మండలాల పశు సంవర్ధకశాఖ ఏడీగా శ్రీధర్ రెడ్డి నియమితులయ్యారు. మదనపల్లె నుంచి ఆయన ఇక్కడికి బదిలీ అయ్యారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పశువులకు మెరుగైన వైద్య సేవలు అందజేయడానికి కృషి చేస్తానన్నారు. పాడి ఆవులకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించిందన్నారు. రైతులు వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

ప్రీస్కూళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలు

బి.కొత్తకోట: అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ప్రీస్కూళ్లుగా తీర్చిదిద్దుతోందని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ కే.భాగ్యమ్మ అన్నారు. బుధవారం స్థానిక బీసీకాలనీలో పిల్లల తల్లులు, బాలింతలతో సమావేశం నిర్వహించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు అభివృద్ధి పనులపై దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రభుత్వ సరఫరా చేసిన పరికరాలు, పిల్లలు తయారుచేసిన వస్తువులు, తల్లులచేత తయారుచేయించిన వస్తువులను ప్రదర్శించారు. సూపర్‌వైజర్ హిజాద్‌ప్యారీ, కార్యకర్త శ్యామల, సచివాలయ కన్వీనర్లు ఫయాజ్, సంతోష్, ఫామిదా పాల్గొన్నారు.

వీఆర్వోల బదిలీ

పెద్దతిప్పసముద్రం: మండలంలో పలువురు వీఆర్వోలు బదిలీ అయినట్లు తహసీల్దార్ విద్యాసాగర్ బుధవారం పేర్కొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని రంగసముద్రం వన్ వీఆర్వోగా రామక్రిష్ణ, రంగసముద్రం టూ వీఆర్వోగా అహమద్, తుమ్మరకుంట టూ వీఆర్వోగా సలీంబాషా,, బూర్లపల్లి వీఆర్వోగా మల్లికార్జున, అంకిరెడ్డిపల్లికి నాగరాజు, టి.సదుంకు ఖాదర్‌బాషా, బూర్లపల్లికి మల్లికార్జున, తుమ్మరకుంట వన్ వీఆర్వోగా చెన్నప్పలను నియమిస్తూ కలెక్టర్ నుంచి ఉత్తర్వులు అందాయని పేర్కొన్నారు.

వలంటీర్లకు దుస్తుల పంపిణీ

ములకలచెరువు: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి సూచన మేరకు బుధవారం మండలంలోని దేవలచెరువు పంచాయతీ వలంటీర్లకు దుస్తులను పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాల గురించి ప్రజలకు క్షుణంగా వివరించాలని సర్పంచ్‌లు మనోహరమ్మ, ప్రభావతి, ఎంపీటీసీ నరసింహులుతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు కేశవరెడ్డి, చక్రపాణినాయుడు, రెడ్డిశేఖర్‌లు వలంటీర్లకు సూచించారు.

ములకలచెరువు పీహెచ్‌సీ తనిఖీ

ములకలచెరువు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో లక్ష్మీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీకి నిత్యం ఎంత మంది రోగులు వస్తుంటారని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. మౌలిక వసతులపై డాక్టర్ జాహ్నవీరెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

పీహెచ్‌సీ రికార్డుల తనిఖీ

పెద్దతిప్పసముద్రం: డిప్యూటీ డీఎంహెచ్‌వో పీ.లక్ష్మి బుధవారం పీటీఎం, కందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిధుల్లోని గర్భిణులు, బాలింతల వివరాలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు అయ్యేలా చూడాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిదే అన్నారు.

విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు

- ఉపాధిహామీ సిబ్బందిపై డ్వామా ఏపీడీ అసహనం
- 17వవిడత సామాజిక తనిఖీ బహిరంగసభ
- రికార్డులు సక్రమంగా నిర్వహించాలి
- ఏపీడీ రవికుమార్



సామాజిక తనిఖీ బహిరంగ సభలో సిబ్బందిని ప్రశ్నిస్తున్న ఏపీడీ రవికుమార్

నిమ్మనపల్లె : ఉపాధిహామీ సిబ్బంది విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని డ్వామా ఏపీడీ రవికుమార్ హెచ్చరించారు. బుధవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయం వద్ద 17వవిడత సామాజిక తనిఖీ బహిరంగ సభ ఏపీఓ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గత 15రోజులుగా నిమ్మనపల్లె మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన రూ. 4,22,27, 277 నిధులతో చేపట్టిన 1836 పనులకు సంబంధించి డీఆర్‌పీలు, గ్రామస్థాయిలో తనిఖీ చేసిన పనుల వివరాలను గ్రామసభలో వెల్లడించారు. పనులవారీగా చదివి వినిపించారు. తనిఖీల్లో భాగంగా డీఆర్పీలు గుర్తించిన లోపాలను ఉపాధిహామీ సిబ్బంది క్షేత్రస్థాయి నిర్లక్ష్యాన్ని అధికారుల దృష్టికి తెచ్చారు. వర్క్‌ఫైల్స్ సక్రమంగా నిర్వహించకపోవడం, 14అంశాలకు సంబంధించి ధృవపత్రాలను సమర్పించాల్సి ఉండగా కేవలం 4 నుంచి 5 పత్రాలు మాత్రమే అందించడాన్ని అధికారులు తీవ్రంగా తప్పుపట్టారు. పలుగ్రామాల్లో హౌసింగ్‌లో భాగంగా చేపట్టిన ఇంటినిర్మాణాలకు సంబంధించి అధికంగా చేసిన చెల్లింపులు, హార్టికల్చర్, అవెన్యూప్లాంటేషన్ నిర్వహణలో ఉపాధిహామీ సిబ్బంది అలసత్వంపై ప్రశ్నించారు. పనితీరు మార్చుకోకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వెంగంవారిపల్లె, నిమ్మనపల్లె గ్రామాల్లో డిజిటల్ లైబ్రరీల నిర్మాణానికి మంజూరైన సిమెంట్ బస్తాలను అనుమతులు లేకుండా ఇతర పనులకు ఉపయోగించడం, దానికి సంబంధించి రికవరీ మొత్తం చెల్లించకపోవడంపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ప్రశ్నించారు. కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేయాల్సిందిగా ఆదేశించారు. ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తనిఖీల్లో భాగంగా వివిధ పనులకు సంబంధించి ఉపాధి హామీ సిబ్బందిపై రూ.7,514 నిధులు రికవరీగానూ, రూ.20,000 జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డి, జెడ్పీటీసీ మధుబాబు, ఎస్ఆర్పీ భాస్కర్, డీఆర్పీలు పవన్, శివకుమార్, నూతన్‌పవన్, టీఏలు పద్మావతి, దివ్య భారతి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న తహసీల్దార్ మహబూబ్‌చాంద్

మదనపల్లె : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న సమగ్ర భూరక్ష–భూహక్కు పథకంలో సర్వేయర్ల పాత్ర కీలకమని తహసీల్దార్ షేక్ మహబూబ్‌చాంద్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల గ్రామ సచివాలయ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో రైతుల భూహక్కుకు సంబంధించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్వే పూర్తిచేయాలన్నారు. సర్వేలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా పూర్తిచేయాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సర్వేకు సంబంధించి ఎక్కువ అర్జీలు వస్తున్న నేపథ్యంలో ప్రతి సోమవారం కచ్చితంగా గ్రామసర్వేయర్లు రెవెన్యూ కార్యాలయంలో అందుబాటులో ఉండాలన్నారు. ప్రజాస్పందనకు సంబంధించి 110 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వభూములు కబ్జా కాకుండా కాపాడాల్సిన బాధ్యత సర్వేయర్లదే అన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్లు బాధ్యతల స్వీకరణ

కలికిరి: జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు కలికిరి తహసీల్దారు కార్యాలయానికి బదిలీపై వచ్చిన ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తంబళ్ళపల్లిలో విధులు నిర్వహిస్తున్న టి.లావణ్య కలికిరి భూ రీ సర్వే డిప్యూటీ తహసీల్దారుగా, అన్నమయ్య జిల్లా సివిల్ సప్లెస్ కార్యాలయం నుంచి సయ్యద్ మొహమ్మద్ రెగులర్ డీటీగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

బాస్కిన్ రాబిన్స్ ప్రారంభం

మదనపల్లె : పట్టణంలోని శ్రీకృష్ణ కాంప్లెక్స్‌లో నూతనంగా బాస్కిన్ రాబిన్స్ ఐస్‌క్రీమ్ పార్లర్ ప్రారంభించారు. పెద్ద పెద్ద నగరాలు, పట్టణాల్లో ప్రజల మన్ననలు పొందిన ఐస్‌క్రీమ్ పార్లర్‌ను మదనపల్లె ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మార్పూరి హేమంత్‌కృష్ణ తెలిపారు. బాస్కిన్ రాబిన్స్‌లో వెనీలా, చాక్‌లెట్, మింట్‌చాక్‌లెట్‌చిప్, ప్రాలైన్స్ ఎన్ క్రీమ్, చాకొలెట్ చిప్‌తో పాటుగా 36 రకాల ఐస్‌క్రీమ్‌లు, కేక్స్, మిల్క్‌షేక్స్ లభిస్తాయన్నారు. కొత్తదనం, క్వాలిటీ, రుచికరమైన పదార్థాలను ఆస్వాదించే ఆహారప్రియులు తమ బాస్కిన్ రాబిన్స్ పార్లర్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మార్పూరి శశిధరరావు, సమిహ, జైవీర్, సశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

డీవైఈఓ ఆకస్మిక తనిఖీ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరు జెడ్పీ హైస్కూల్‌ను బుధవారం మదనపల్లి డీవైఈఓ క్రిష్టప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, టీచర్ల పని తీరు, పాఠశాలలో మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపుపై దృష్టి సారించి మెరుగైన విద్యనందించాలని సూచించారు. ఎంఈఓ నారాయణతో పాటు స్థానిక వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్తమ డిపోగా తీర్చిదిద్దాలి

మదనపల్లె సిటీ: సిబ్బంది అందరూ కలిసి ఉత్తమ డిపోగా తీర్చిదిద్దాలని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ వన్ డిపో కార్యాలయంలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల పట్ల మర్యాద పాటించాలన్నారు. వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. గత నెలలో సమ్మర్ స్పెషల్ నడపడం వల్ల డిపోకు మంచి ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టిఐ–2 బి.వి.నాయక్, సిబ్బంది నాగరాజునాయుడు, లతీఫ్, శ్రీకాంత్, బాబ్జీ, రెడ్డప్ప, వేణుగోపాల్, రఫీ, రమణ, కృష్ణయ్యలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చౌడసముద్రం సర్పంచు రాంబాబు, డీఎం మూరె వెంకటరమణారెడ్డి, సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక వరం

పీలేరు : జగనన్న విద్యాకానుక పేద విద్యార్థులకు ఓ వరం లాంటిదని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యకు రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని తెలిపారు. జగనన్న విద్యాకానుక కిట్లు సద్వినియోగం చేసుకుని విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జోహర్, నాయకులు రెడ్డిబాషా, మునీర్, అబీద్, జిలానీ, రమణ, అల్లాబక్షు, కాలనీ చిన్న, హెచ్‌ఎం శ్రీరాములు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

బి.కొత్తకోట: రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని తహసీల్దార్ రఫీక్‌అహ్మద్ అన్నారు. బుధవారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో రక్తదాన దినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ హార్సిలీహిల్స్ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. శిబిరంలో 63 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ కుమార్ అభినందించారు.

వాల్మీకిపురం: రక్తదానం చేసి.. సాటి మనిషి ప్రాణాలు కాపాడుదామని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

జీపీఎస్‌కు ఆమోద ముద్ర హర్షణీయం



వైఎస్సార్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ యూనియన్ నాయకులు

పీలేరు రూరల్ : ఆర్టీసీ ఉద్యోగస్తులకు గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్)కు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో క్యాబినెట్ ఆమోద ముద్ర వేయడం హర్షణీయమని వైఎస్సార్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరాజులు అన్నారు. బుధవారం ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర డైరెక్టర్ ఎ. రాజారెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి రాజారెడ్డి సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి ఆర్టీసీ ఉద్యోగులు రుణపడి ఉండాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఉప ప్రధాన కార్యదర్శి రవిశంకర్, రాష్ట్ర కార్యదర్శి గోవిందు, జిల్లా అధ్యక్షులు టి. చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి రామ్మోహన్‌రావు, నాయకులు వెంకటేశ్వర్లు, ప్రభాకర్, చంద్రశేఖర్, ఆర్.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి



రాయితీగడ్డి విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ నరసింహులు

నిమ్మనపల్లె : ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ నరసింహులు, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వెటర్నరీ కార్యాలయం వద్ద పాడిరైతులకు రాయితీగడ్డి విత్తనాలను పశువైద్యాధికారి డాక్టర్.సాధుసురేష్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాడిరైతులు పశుగ్రాసం పెంచుకోవడానికి ప్రభుత్వం 75శాతం రాయితీతో విత్తనాలను అందిస్తోందన్నారు. నిమ్మనపల్లె, రెడ్డివారిపల్లె, పశువైద్య కేంద్రాలతో పాటు మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో మొక్కజొన్న, జొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఆర్బీకేలలో సంప్రదించి రాయితీ గడ్డి విత్తనాలను పొందాలన్నారు. అదేవిధంగా రాయితీపై గడ్డికత్తిరించే యంత్రాలను ప్రభుత్వం 40శాతం సబ్సిడీతో అందిస్తోందన్నారు. ఒకో యంత్రం ధర రూ.33,970 కాగా, రూ.20,382 కే రైతుకు అందిస్తున్నామన్నారు. అవసరమైన రైతులు రైతుభరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదుచేసుకోవాలన్నారు. పశువైద్యాధికారి సురేష్ మాట్లాడుతూ...ఈనెల 15 నుంచి 30 వరకు గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు విజయకుమార్‌రెడ్డి, సిబ్బంది వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓ భానుప్రసాద్‌ను అభినందిస్తున్న సిబ్బంది

మదనపల్లె : మండల ఎంపీడీఓగా భానుప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ కడప జిల్లా బద్వేలులో ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా పదోన్నతిపై మదనపల్లె మండల ఎంపీడీఓగా కమిషనర్ ఉత్తర్వుల మేరకు బాధ్యతలు తీసుకున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఎంపీపీ రెడ్డెమ్మ, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, వైస్‌ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్ల సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. బాధ్యతలు స్వీకరించిన భానుప్రసాద్‌కు మండల ఏపీఓ సుబ్రహ్మణ్యం, ఏఓ రెడ్డెమ్మ, సీనియర్ అసిస్టెంట్ లేఖ్య, ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు, వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ఉదయ్‌కుమార్, జిల్లా అధ్యక్షులు జమాల్‌వలి, మండల అధ్యక్షులు వెంకటపతి తదితరులు దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.

నిమ్మనపల్లె ఎంపీడీఓగా శేషగిరిరావు



నిమ్మనపల్లె ఎంపీడీఓ శేషగిరిరావు

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె ఎంపీడీఓగా శేషగిరిరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా నగరి ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న శేషగిరిరావు పదోన్నతి బదిలీపై నిమ్మనపల్లెకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎఫ్ఏసీ ఎంపీడీఓ లీలామాధవి పదోన్నతిపై నగరి ఎంపీడీఓగా బదిలీ అయ్యారు.

ఈఓపీఆర్డీగా చలపతిరావు..

నిమ్మనపల్లె మండల ఈఓపీఆర్డీగా చలపతిరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓ శేషగిరిరావుకు జాయినింగ్ రిపోర్ట్ అందించారు. రామసముద్రం ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న చలపతిరావు బదిలీపై నిమ్మనపల్లెకు వచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రటరీలు మారెప్ప, మంజుల, వెంకటరమణారెడ్డి, ఎంపీడీఓ, ఈఓపీఆర్డీలను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

కలకడ ఎంపీడీఓగా పరమేశ్వర్‌రెడ్డి



కలకడ ఎంపీడీఓ జి.పరమేశ్వర్‌రెడ్డి

కలకడ : కలకడ మండల పరిషత్ అధికారిగా జి.పరమేశ్వర్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓ గా పనిచేస్తున్న నారాయణ బదిలీపై వెళ్లగా కలికిరి ఎంపీడీఓ గంగయ్య ఇన్‌చార్జ్ ఎంపడీఓగా బాధ్యతలు నిర్వహిస్తూ ఉన్నారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు నుంచి కలకడకు పరమేశ్వర్‌రెడ్డి బదిలీపై వచ్చారు. గ్రామాలు, పంచాయతీల, మండలాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అందరూ సహకరించి అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు.

చెత్తసేకరణపై దృష్టి సారించండి

– డీపీఓ ధనలక్ష్మి



వెలిగల్లులో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ ధనలక్ష్మి

పెద్దమండ్యం: గ్రామాలలో చెత్త సేకరణపై దృష్టి సారించి చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని డీపీఓ ధనలక్ష్మి అన్నారు. మండలంలోని వెలిగల్లు గ్రామంలోని చెత్త సంపద కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాలలో చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. చెత్త సంపద కేంద్రాలలో తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువుల తయారీ చేపట్టాలని సూచించారు. పల్లెల్లో ఎక్కడబడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని ఆమె పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఆయా శాఖల వారీగా గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించాలన్నారు. అలాగే వెలిగల్లులో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, పిల్లల హాజరుపై ఆరా తీశారు. పౌష్టికాహారాన్ని పిల్లలకు సక్రమంగా అందించాలని ఆమె ఆదేశించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై వారితో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఈవోపీఆర్‌డీ జనార్దన్, సర్పంచ్‌లు మొలక బయ్యారెడ్డి, సి సరస్వతి, పంచాయతీ కార్యదర్శులు శైలజ, జగన్‌మోహన్, రెడ్డిప్రసాద్, ఖాదర్ బాషా, సోముశేఖర, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి



కాలేజ్ బస్సు రికార్డులు పరిశీలిస్తున్న ఏఎంవీఐ శివలింగయ్య

మదనపల్లె : ప్రైవేట్ పాఠశాలలు, కళాశాల బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరిగా ఉండాలని, ఎఫ్‌సీ లేకుండా రోడ్డుపైకి వచ్చిన వాహనాలను సీజ్‌చేయడంతో పాటుగా జరిమానా విధించడం జరుగుతుందని ఏఎంవీఐ శివలింగయ్య అన్నారు. బుధవారం స్థానిక రవాణాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మదనపల్లె ఆర్టీఏ కార్యాలయ పరిధిలోని స్కూల్,కాలేజ్ బస్సులకు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి కనీసం 5 సంవత్సరాలకు పైగా అనుభవంతో పాటు 60 ఏళ్లలోపు వయస్సు కలిగిన వ్యక్తులనే డ్రైవర్లుగా నియమించుకోవాలన్నారు. బస్సులు కండీషన్‌లో ఉంచుకోవడంతో పాటుగా టైర్లు, హెడ్‌లైట్లు, వైపర్ బాగుండాలన్నారు. ఎమర్జెన్సీ ఎగ్జిట్, పిల్లలు దిగేందుకు వీలుగా బస్సు ఫుట్‌బోర్డు ఏర్పాటుచేసుకోవాలన్నారు. ఫస్ట్‌ఎయిడ్‌బాక్స్, అగ్నిమాపక రక్షణ పరికరాలు లేకపోతే ఫిట్‌నెస్ సర్టిఫికేట్ ఇవ్వమన్నారు. బస్సులో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించరాదని, ప్రతి బస్సుకు డ్రైవర్‌తో పాటు సహాయకుడిని నియమించాలన్నారు. బస్సును వేగంగా నడిపినా, ఫోన్‌లో మాట్లాడుతూ అజాగ్రత్తగా వ్యవహరించినా డ్రైవర్‌పై చర్యలు తీసుకునేలా విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ ద్వారా బస్సుల్లో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలన్నారు. మదనపల్లె ఆర్టీఏ కార్యాలయ పరిధిలో 90శాతానికి పైగా బస్సులు ఎఫ్‌సీ చేయించుకున్నాయన్నారు.

వైభవంగా శ్రీచౌడేశ్వరిదేవి జాతర



ప్రత్యేక అలంకారంలో శ్రీచౌడేశ్వరి దేవి

రామసముద్రం: మండలంలోని గుంతలపేట గ్రామంలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవి జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతుస్వామి ధ్వజావరోహణం, గణపతిపూజ, అమ్మవారికి అభిషేకం , కుంకుమార్చన, విశేషాలంకరణ, మహా మంగళహారతి, తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం బలిహోరం, అఖండజ్యోతి, త్రిశూలం ఊరేగింపు చేశారు. అనంతరం బోయకొండ గంగమ్మ మారెమ్మ , మారెమ్మకు దీపాలు , పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అలాగే కుదురుచీమనపల్లె పంచాయతీ వనగానిపల్లెలో గంగజాతర వైభవంగా నిర్వహించారు. గత 50 ఏళ్ల అనంతరం జరిపిన గంగజాతర అత్యంత వైభవంగా చేశారు.

గుప్తనిధుల ముఠా హల్‌చల్ ?

పీలేరు : కొంతకాలంగా బంగారు చెంబు.. చాలా మహిమ కల్గిందని, చాలా విలువైందని చెబుతూ గుప్త నిధుల ముఠా అమ్మకానికి పెట్టినట్లు పలు ప్రాంతాల్లో ప్రజలు గుసగుసలాడుతున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. కేవీపల్లె మండలం దేవరచెరువు సమీపంలోని పురాతన మల్లినాథస్వామి ఆలయం వద్ద కొంత కాలం క్రితం గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. ఈ తవ్వకాల్లో బంగారు చెంబు బయట పడిందని పుకార్లు, షికార్లు చేస్తున్నాయి. గుప్త నిధుల ముఠా పీలేరు, తిరుపతి ప్రాంతాల్లో సంపన్న కుటుంబాలను కలసి బంగారు చెంబు శతాబ్దాల క్రితం నాటిదని, చాలా మహిమ గలదని విక్రయానికి పెట్టినట్లు ప్రజలు చెప్పుకుంటున్నారు. సుమారు 5 కేజీల బరువుగల చెంబు రూ. 3 కోట్లు అవుతుందని బేరసారాలు జరిగినట్లు సమాచారం. గతంలో కేవీపల్లె మండలంలో పురాతన ఆలయంలో తవ్వకాలు జరిపిన ఓ ముఠాను పోలీసులు అరెస్ట్ చేయడం కూడా జరిగింది. పోలీసులు ఇలాంటి సంఘటనలపై దృష్టి సారించి గుప్తనిధుల ముఠా ఆగడాలు కరికట్టాలని పలువురు కోరుతున్నారు.

స్థానిక వనరుల వినియోగంతోనే ఆర్థికాభివృద్ధి

తంబళ్లపల్లె: మండలంలోని మహిళా సంఘ సభ్యులు స్థానిక వనరులను గుర్తించి వినియోగించుకున్నప్పుడే ఆర్థిక అభివృద్ధి చెందుతారని ఏపీఎం రాజన్న తెలిపారు. బుధవారం స్త్రీశక్తి భవన్‌లో మహిళా సంఘ సభ్యులకు, సంఘమిత్రలకు విజన్ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు, స్థానిక వనరులను గుర్తించి వాటి వినియోగించుకోవాలన్నారు. వనరులను గుర్తించడం, వినియోగం, ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాల వినియోగం , తిరిగి రుణాల చెల్లింపులపై వివరించారు.

ఏపీఈఏపీసెట్‌లో కృష్ణారెడ్డి సిద్ధార్థ విజయపరంపర



ఉత్తమర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఎన్.కృష్ణారెడ్డి

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ ఈఏపీసెట్ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. మదనపల్లె శ్రీ కృష్ణారెడ్డి సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంజనీరింగ్, వ్యవసాయ కోర్సుల్లో టాప్ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎన్.కృష్ణారెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన ఏ.హర్షిణిప్రియ 3445, కీర్తన 5502, చందుశ్రీ 8247, బి.మెర్లిన్ మడోన్నా 8503, ఎం.బాలాజీ 9,423, ఎస్.హర్షిత 10,810, ఎస్.లక్ష్మీసాగర్ 11,102, ఎస్.హిమబిందు 11,278, కే.రెడ్డిలోకేష్ 11,667, ఎస్.దీప 12,172, శ్రీచరణి 13,259 ర్యాంకులను సాధించారన్నారు. ఈఏపీసెట్‌లో ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

నీట్ ఫలితాల్లో మెరిసిన పీలేరు విద్యార్థినులు



తల్లిదండ్రులతో కృష్ణచందన



తల్లిదండ్రులతో మాధురి

పీలేరు రూరల్: నీట్ ఫలితాల్లో పీలేరుకు చెందిన ఇద్దరు విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. పీలేరు పట్టణం ప్రశాంత్ నగర్‌కు చెందిన ఈవో వరప్రసాద్, వెంకటేశ్వరిల కుమార్తె కృష్ణచందన రాష్ట్ర స్థాయిలో 424, ఆల్ ఇండియా లెవెల్‌లో 5605 ర్యాంక్ సాధించి ప్రతిభను చాటుకుంది. అలాగే స్థానిక చెన్నారెడ్డి వీధికి చెందిన ఉపాధ్యాయుడు రామాంజులు, రామలక్ష్మీల కుమార్తె మాధురి రాష్ట్ర స్థాయిలో 583 ర్యాంకు సాధించి ప్రతిభ చూపింది. నీట్‌లో మంచి ర్యాంకులు సాధించిన వారిని పలువురు అభినందించారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

పీలేరు : స్థానిక నాగిరెడ్డి కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, రిటైర్డ్ ఎల్ఐసీ మేనేజరు రమణారెడ్డి తండ్రి బి. వెంకటరెడ్డి (97) మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బుధవారం స్థానిక నాగిరెడ్డి కాలనీకి చేరుకుని మృతదేహానికి పూల మాలలతో నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, చింతల రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం

వాల్మీకిపురం: అగ్నిప్రమాదంలో హార్డ్‌వేర్ దుకాణాన్ని పోగొట్టుకున్న బాధితులను బుధవారం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పరామర్శించారు. స్థానిక తరిగొండ రోడ్డులోని ఎంకే హార్డ్‌వేర్ దుకాణం వద్దకు ఎమ్మెల్యే చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. అలాగే బాధితులు ఉమ్మర్, జుబేర్‌లను పరామర్శించారు.